దోషి

"నీ పేరు?"

"లలిత"

తలెత్తి చూశాను.

బోనులో, చీరకొంగు నెత్తినిండా కప్పుకుని, తలొంచుకుని నిలబడ్డది లలిత!

"వృత్తి?"

లలిత ముట్లాడలేదు. ప్రాసిక్యూటర్ వేపొకసారి చూసి, తలొంచుకుంది.

ప్రాసిక్యూటర్, కేసు పూర్వాపరాలు వివరించసాగాడు. నా మనస్సు వేరేచోట వుంది.

....లలిత నాకు బాగా తెలుసు. లలిత నేనూ కలిసి చదువుకున్నాం చిన్నప్పటి నుంచీ! అలా నా ముందు ఒకనాడు దోషిగా నిలబడుతుందని గానీ, ఆమె చేసిన నేరానికి నేను న్యాయమూర్తిగా శిక్ష విధించాల్సి వస్తుందనిగానీ, ఊహించలేదు.

".... ఈ కారణాల దృష్ట్యా, లలిత అనే ఈమెకు ఐ. పి. సి..... సెక్షను క్రింద, మూడు నెలల శిక్ష, ఐదువందల జరిమానా విధించవలసిందిగా కోర్టు వారికి విన్నవించుకుంటున్నాను" ప్రాసిక్యూటర్, పాఠంలా వప్పచెప్పి కూర్చున్నాడు.

కోర్టు హాలంతా నిశ్శబ్దమైంది

బోనులో నిలబడ్డ లలిత తలెత్తి చూడలేదు.

ఈ కేసు పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ బోను ప్రక్కగా నిలబడి వున్నాడు. ఆ వెనుక ఇద్దరు పోలీసులు.

నిందితురాలు ఆడది. అంతేగాక రూపసి. కనుక పనిలేని జనం కోర్టు హాలులో చాలామందే చేరారు. అక్కడున్న యావన్మంది దృష్టి నా మీదే వుంది. ఒక్క లలిత తప్ప అందరూ నా వేపే చూస్తున్నారు.

జడ్జిమెంట్ వాయిదా వేశాను, సాయంత్రానికి.

పైన ఫ్యాను తిరుగుతున్నా నాకు ఉక్కపోస్తూనే వుంది. పైన నల్లకోటు, ఎదురుగా చిన్ననాటి స్నేహితురాలు!

లంచ్ వేళయింది. లేచి చాంబర్స్‌లో కెళ్లాను. కోటువిప్పి, స్టాండుకు తగిలించి, కుర్చీలో పడుకున్నాను. "లలిత.... అదే ఇంతకుముందు బోనులో వుంది చూడు.... ఆ అమ్మాయిని తీసుకురా" అని బంట్రోతును పంపాను.

....లలిత చాలా దిగజారిపోయింది. చదువుకుని, సంస్కారం కలిగివున్న లలిత, ఇంతటి హేయమైన బ్రతుకుని ఎన్నుకుని, ఎలా తిరగగలుగుతున్నది

లలిత వచ్చి వాకిలి వెంబటే నిలబడ్డది. పాదాలు పచ్చగా వున్నాయి. చీరకొంగు జరీ, ఆ పాదాల పచ్చదనం ముందు వెలితిగా వుంది.

'కూర్చో'' కాళ్ల క్రిందవున్న కుర్చీ కాలితో, ఆమె దగ్గరకు నెట్టాను.

లలిత కూర్చుంది తలొంచుకుని.

ఆమెను అంత దగ్గరగా చూడటానికి మనసులో బెరుకుగావుంది

"టిఫిన్ తెప్పించేదా?"

లలిత మాట్లాడలేదు!

పెళ్లిచూపులప్పుడు, కూర్చునే ఆడపిల్లలా కూర్చోనుంది కుర్చీలో.

"నన్ను గుర్తుపట్టావా?"

"ఊ।"

కుర్చీలోంచి లేచి కూర్చున్నాను.

లలిత గోడమీద తల ఆనించి, పైకప్పుకేసి చూడసాగింది.

బంట్రోతును కేకేసి, కాఫీ తెమ్మన్నాను.

"మీ నాన్నగారెలా వున్నారు"

"బాగానే వున్నారు।"

"ఓసారి మా యింటికి రమ్మను"

"ఆయనెక్కడకూ రారు।"

"మా యింటికి తప్పకుండా వస్తారు।"

"పక్షవాతం—మంచంలోంచి లేవలేరు"

"ఎన్నాళ్లయింది?"

"ఈ మధ్యనే।"

నా గొంతు పూడుకుపోయింది. లలిత ముక్తసరిగా యిచ్చే సమాధానాలు, నాకు, మరీ ఇబ్బంది కలిగిస్తున్నాయి. నేను న్యాయమూర్తిని—ఆమె దోషి.... అన్న సంబంధం ఇక్కడ లేదని చెప్పాలని నా అభిప్రాయం.

"నేను మీ యింటికి వస్తాను"

లలిత ఆశ్చర్యంగా చూసింది నా వేపు. ఆమె పెదాల మధ్య చిరునవ్వు మొగ్గ వేసింది.

"మీ అడ్రసు చెప్పు"

"నా పేరు చెప్పండి చాలు, రిక్షావాడు తీసుకొస్తాడు" ఆ సమాధానంలో

అవహేళన వుందేమో అనిపించింది!

మా యిద్దరి కళ్లూ, చూపులూ కలిశాయి నే నోడిపోయాను. కళ్లుదించేసుకున్నాను.

బంట్రోతు కాఫీ తెచ్చి కప్పుల్లో పోశాడు. చెరోటీ యిచ్చి వెళ్లాడు.

"తాగు."

"నేనింకా ముహం కడుక్కోలేదు. స్నానం చెయ్యలేదు।...."

నేనేం మాట్లాడేది!

లలిత లేచి నిలబడ్డది. ''జడ్జిమెంటు త్వరగా యిస్తే వెడతాను।''

లలిత తమ్ముడు గురించీ, చెల్లెళ్ల గురించి అడగాలనుకున్నాను. అడగలేకపొయ్యాను

లలిత పోవటానికి సిద్ధమైంది

"పోలీసులు, రాత్రినించీ లాకప్‌లోనే వుంచారా?''

వాళ్ల డ్యూటీ అది।''

ప్రసాద్ గురించి చెప్పాలనివుంది. అసలు లలితే అడుగుతుందని ఆశించాను.

''బెయిల్ ఇస్తాను. ఇంటికెళ్లిరా।''

''నేనడగందే యిస్తారా?''

ఆ ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేదు.

లలిత వెళ్లిపోయింది.

కుర్చీలోకి జారి, పడుకున్నాను—

....నేను అనాథను. నరసింహారావు గారు చేరదీశారు. కులస్థుడనన్న

భావం గావచ్చు. లేదా, చదువుకుని పైకి వస్తాడన్న భావమన్నా కావచ్చు. లేదా, వాళ్లింట్లో, చచ్చేదాకా మా అమ్మ చేసిన వంటకు కృతజ్ఞత వల్లనైనా గావచ్చు.

ప్రసాద్, నేనూ యించుమించు ఒకే ఈడువాళ్లం. మా యిద్దరికీ స్నేహం కూడాను.

ప్రసాద్, సన్నగా, పీలగా, ద్రావకంలోంచి తీసిన బొమ్మలా వుండేవాడు.

నరసింహరావు గారికి అతగాడంటే పంచప్రాణాలు. కోరిక మనస్సులో వుండగానే, ఆ కోరికలు ప్రాణం పోసుకుని కళ్లముందు ప్రత్యక్షమయ్యేవి,

నరసింహారావుగారు లాయరు, పేరు—ప్రఖ్యాతిగల లాయరు. వృత్తిరీత్యా గాకుండా, నరసింహారావుగారికి పొలాలు, ఇళ్లు, కంపెనీలో షేర్లు వున్నాయి. ఇవన్నీ చూచేందుకు వున్న గుమాస్తాల్లో ఒకడే చలపతిరావు. అంటే లలిత తండ్రి.

లలిత చిన్నప్పుడు, చలాకీగా వుండేదిగాదు. అందమైందీ గాదు. లావుగా, బొద్దుగా వుండేది. తలకు తైల సంస్కారంలేక, ఎర్రగావుండే జుత్తు, రెండు జడలు వేసుకుని, చూడటానికి తమాషాగా వుండేది.

నరసింహారావుగారి నీడలోవున్న చలపతిరావు రాత్రింబవళ్లు, యజమాని సేవలో, అయన వ్యవహారాలు చూస్తూ వుండేవాడు. కుక్కకన్నా విశ్వాస మైనవాడు. ఆయనంటే నరసింహారావుగారికి జాలి గూడ వుంది. పిల్లలు కల వాడని, పదీ పరక జీతం, అడక్కుండానే పెంచేవాడు. ఇంటికొచ్చే కూరలు, పాలు, పెరుగు తదితర వస్తువులు, చలపతిరావుగారి కిచ్చేవాడు అయాచితంగా!

గాలికి, వానకు మొలిచిన మొక్క పెరిగి పెద్దదైనట్లు, లలిత స్కూలు ఫైనల్ పరీక్ష ప్యాసయింది. ఆ తర్వాత కాలేజీలో చేరతానని మొండికేసింది.

వ్యవహారం నరసింహారావుగారి దాకా వెళ్లింది. అంటే లలిత పెళ్లి, ఆయనకు విన్నవించుకుంది.

నరసింహారావుగారిది జాలిగుండె. వయస్సు మీదకొచ్చేకొద్దీ, నిత్యనైమిత్తికమైన పనులు వేరే వాళ్ళకు అప్పచెప్పి, మేడగదిలో, ఉయ్యాల బల్లమీద పద్మాసనం వేసుకు కూర్చుని వుండేవారు రోజంతా.

చలపతిరావుకు సంతానం, మితం దాటివుంది. సంపాదన కూటికీ గుడ్డకూ సరిపోతుంది. శేషం మిగలదు. మరీ అందరిలోకి పెద్దది లలిత. చదువు మాన్పిస్తే, పెళ్లి చెయ్యలేడు. అథవా అలాంటి ప్రయత్నంలోకి అడుగు పెట్టినా, ఇవ్వాళ అనుకుంటే మరో నాలుగేళ్లకు కార్యరూపం దాల్చగల స్తోమత చలపతిరావుది.

ఇవన్నీ నరసింహారావుకు తెలియనివేం గాదు.

''ఒరేయ్। దాన్ని కాలేజీలో చేర్చు'' అన్నారు నరసింహారావుగారు।

చలపతిరావుగారు మాట్లాడలేదు. లలిత ఛంగున గంతులేస్తూ, పరిగెత్తింది సంతోషంతో.

''డబ్బు పట్టుకెళ్లు, దాని చదువుకూ, పుస్తకాలకూ నువ్వు బెంగెట్టుకోకు. ఇక్కడనుంచే పట్టుకపో।'' నరసింహారావుగారిది జాలిగుండె

లలిత కాలేజీలో చేరింది ఇంటరులో. అప్పుడు ప్రసాద్, నేనూ బి.ఏ లో వున్నాం....

గతం గుర్తుకొచ్చి, నా మనస్సు వికలమైంది.

లలిత కేసు తీర్పు ఇవ్వాలి. మా కిద్దరికి పరిచయమున్న సంగతి. నా బంట్రోతు కనిపెట్టివుంటాడు. అది నా ఊహకాదు.

"అయమ్మ బాబూ! చాలామంచి కొంపలార్పింది బాబూ! కోర్టుకయితే

ఇయ్యాళ వచ్చిందిగానీ, పోలీసులు పట్టుకోడం, డబ్బుయిచ్చి వదిలించుకోడం శానా రోజుల్నుంచీ జరుగుతావుంది" ఇవి నాబంట్రోతు అయాచితంగా చెప్పిన సంగతులు.

"ఆమె ఇల్లు తెలుసా।"

"తెలుసండీ. రైలుపేట, గాంధీ బొమ్మకాడ"

"స్వంత ఇల్లేనా।"

''రెండంతస్తుల భవంతండీ. అద్దెలే రెండు మూడు వందలొస్తాయి''

''యింట్లో యింకెవరన్నా వుంటారా।''

''తమ్ముళ్లూ, చెల్లెళ్లూ వుండారండీ. అంతా చదువుతూ వుండారు. ఒకాయిన విశాఖపట్నంలో డాక్టరు పరీక్ష గూడ ఇస్తున్నాడంటారు।"

కోటు వేసుకుని, బెంచీమీదకు వెళ్లాను. లాయర్లంతా సంభాషణ మానేసి లేచి నిలబడ్డారు. లలిత కోర్టువరండాలో చతికిలబడి వున్నదలా లేచి నిలబడ్డది అంతే, కోర్టు హాల్లోకి రాలా! సబ్‌ఇన్స్‌పెక్టర్, చువ్వలా నిలబడి, సెల్యూట్ చేశాడు.

జడ్జిమెంటు ఇచ్చేశాను.

2

రాత్రి ఎ.మిది గంటలైంది.

డాబామీద కుర్చీవేసుకు కూర్చున్నాను.

చంద్రుడు కొబ్బరిచెట్టు ఆకుల వెనుక దోబూచులాడు కుంటున్నాడు. దూరంగా వున్న రైసుమిల్లు దడదడలాడుతూ, శబ్దం చేస్తున్నది. రోడ్డుకు దూరంగా వుండటంవల్ల లారీలు, బస్సుల రణగొణధ్వని లేదు. పైగా, నా

సంసారం. నాలుగో కాన్పుకు, వారసులతో వెళ్లింది. అందుకని ప్రశాంతంగా వుంది.

....నరసింహారావుగారు ఓ రోజు నన్ను పిలిచారు. ఆయన గదిలోకి

ఆయన, నేను ఇద్దరమే ఆ గదిలో.

''ఏరా! ఎలా చదువుతున్నారు?''

చెప్పాను.

ఆయన క్షణం ఆలోచనలో పడ్డారు. ఆయన అడగాలనుకున్నది. మా చదువు గురించిగాదు. ఎందుకంటే ప్రసాద్ తెలివిగలవాడు కాకపోవచ్చు. కానీ అత్తెసరు మార్కులతో ప్రతి పరీక్ష ప్యాసవుతూనే వున్నాడు.

''ఒరేయ్! లలిత, ప్రసాద్ ప్రేమించుకున్నారుట. పెళ్ళి చేసుకోవాలని గూడ తీర్మానించుకున్నారుటగా! నిజమేనా?''

నేను ఇరకాటంలో పడ్డాను. ఎగదీస్తే బ్రహ్మహత్య, దిగదీస్తే గోహత్య,

''పరవాలేదు చెప్పు ప్రసాద్ వచ్చే నేను లలితను చేసుకుంటానని అన్నాడు ఊరికే సంగతులు తెలుసుకుందామని అడిగానంతే. పోన్లే నీకంత కష్టంగా వుంటే చెప్పకు, వెళ్లు! అన్నారు నరసింహారావుగారు.

ఆయన లాయరు, పైగా మనిషిని చూడగానే వాడి జాతకం చదివెయ్యగల నేర్పు, తెలివిగలవారు! నేను ఆయన దయా ధర్మాలమీద బ్రతికేవాడిని,

చెప్పాను.

ఆయనకు చెప్పినట్లు, ప్రసాద్‌కు చెప్పాను.

ప్రసాద్‌కు అనారోగ్యం లేదు. అలా అని ఆరోగ్యమూ లేదు. ఎప్పుడు నీరసంగా కనబడతాడు. పల్చటి గుడ్డలుగూడ, వాడికి బరువే అనిపిస్తాయి. మల్లెపువ్వంత సుకుమారంగా వుంటాడు.

"నాన్న యింత తేలిగ్గా. మా పెళ్లికి అంగీకరిస్తాడని, నేనమ్మలేదు సుమా!"

నాకు అది ఆశ్చర్యంగానే వుంది.

నరసింహారావుగారు, ఓ రోజు చలపతిరావును కబురంపి పిలిపించారు.

అప్పుడు నేనూ అక్కడే వున్నాను. ప్రసాద్ కూడ వున్నాడు.

చలపతిరావు, చేతులు కట్టుకు నిలబడ్డాడు.

విషయమంతా వివరించి "ఏమయ్యా! మావాడు, మీ లలితను చేసుకుంటా నంటున్నాడు. నేను సరే అన్నాను! కులమింటి కోతి. అదీగాక మీ అమ్మాయి కళ్లముందు పెరిగింది. గుణగణాలు తెలియనివేంగాదు. నువ్వెంత నా బంటువైనా, లగ్నాలు నిశ్చయించే ముందు నీ అభిప్రాయం తెలుసుకోవాలిగా!.... చెప్పు. లగ్నాలు పెట్టించమంటావా?" నరసింహారావుగారు అడిగారు.

చలపతిరావు ఎగిరి గంతు లెయ్యలేదు. నరసింహారావు పాదాలు పట్టుకుని, ఆనంద భాష్పాలతో వాటిని కడిగి, కళ్ల కద్దుకుని, "బాబూ! మీ మాటకు ఎదుభు చెబుతానా! తమ విశాలహృదయానికి నా జోహారు. తమ ఋణం జన్మ జన్మలకు తీర్చుకోలేను" అనిగూడ అనలేదు!

నరసింహారావుగారు, "ఏమిటలా మాటాపలుకూ లేకుండా నిలబడతావ్?" యిందులో ఆలోచించాల్సిందేముంది?-" అని విసుక్కున్నారు. గద్దించి మరీ అడిగారు.

చలపతిరావు మౌనం భయంకరంగా వుంది.

నేను ఆశ్చర్యపోయాను. ప్రసాద్ ఆయన్ని విచిత్రంగా చూశాడు. మాకేమీ పాలుపోలేదు.

"క్షమించండి బాబూ! మీ వాడికి మా పిల్లనిచ్చి దాని గొంతు కొయ్యలేను. వస్తా...."

చలపతిరావు. మెరుపులా మాయమయ్యాడు, అక్కడనుంచి।

ఆయన నడకలో తత్తరపాటుంది. భయముంది. నిరాశ, నిస్పృహకూడ వున్నాయి,

నరసింహారావుగారు, రేసుకుక్కలా లేచారు. నోటి కొచ్చినట్లు, చలపతి రావును తిట్టారు బండబూతులు.

''వెధవకు డబ్బు చేదయింది. కళ్ళకు పొగరుకమ్మింది. వళ్లుకొవ్వెక్కింది। నే తల్చుకుంటే, వీడి బ్రతుకు బజార్న పడుతుందని తెలియదు।...." ఇలా నాల్గురోజులు తిడుతూనే వున్నారు. శాపనార్ధాలు పెడుతూనే వున్నారు,

ప్రసాద్ మంచమెక్కాడు. నిరుత్సాహపడ్డాడు. నీరయిపోయాడు.

నరసింహారావుగారు, వేరే పెళ్లి సంబంధాల ఎన్నికలో నిమగ్నులయ్యారు.

ప్రసాద్ నాకు మిత్రుడేగాదు, బహిః ప్రాణంగూడ.

ఒంటరిగా, లలితను కలిశాను.

వయస్సు, దీటుగా వున్న అవయవ సౌష్టవం, లోకజ్ఞానం, అనుభవంవల్ల ఆరితేరిన లలిత, ఇప్పుడు అందంగావుంది ఆమె అందం, వయస్సులోవున్న కుర్రాళ్లకు ఆకర్షణీయంగా వుంది.

"రఘూ। మా బ్రతుకుల్ని ముడివేసే బాధ్యత నీది. నీ యిష్టం। ఏం చేసినా సరే।" అంది.

చలపతిరావు వింతప్రవర్తనకు, ఆమె సమాధానం చెప్పలేకపోయింది. గత నాల్గురోజులుగా, ఆయన సరిగా అన్నం తినటంలేదు. తనలో తాను గొణుక్కోవటం, నిద్రలో కలవరించడం, దిగులుగా, ఏదో పోగొట్టుకున్న వాడిలా తిరగటం, లలితకూ అర్థంగాలేదు. చలపతిరావు పరాజితుడు. ఎందుకో తెలియదు.

ఆలోచించాను. నా ఆలోచన అటు లలితకూ, ఇటు ప్రసాద్‌కూ నచ్చింది. ఒక విధంగా అంతకన్నా గత్యంతరం లేదు.

ప్రసాద్‌ను కాదని నరసింహారావు బ్రతకలేడు. కారణాలేవైనా, లలిత తండ్రి చలపతిరావు అసమర్థుడు. నరసింహారావుగారిని ఎదిరించి, కట్టిన మంగళసూత్రం తెంపేసి, కూతురు ముందు నిలబడలేడు.

కనుక లలిత, ప్రసాద్‌ల వివాహం జరిగితీరాలి, రహస్యంగా, ఆవేశాలు, కావేషాలు తగ్గాక, మనస్సులు కుదుటపడ్డాక, లలిత, ప్రసాద్‌లు, భార్యాభర్తలుగా, ప్రవేశిస్తారు. కథ కంచికి వెడుతుంది

ఓ రాత్రి, సూట్‌కేస్ నిండా డబ్బు సర్దుకుని, ప్రసాద్, ప్రయాణమయ్యాడు.

లలిత, ప్రసాద్ మద్రాసు వెడతారు. అక్కడే పెళ్లిచేసుకొంటారు. హనీమూన్ గడిపి, నే ఉత్తరం వ్రాశాక ఇద్దరూ తిరిగి వూళ్లోకి వస్తారు. ఇది నా నిర్ణయం.

కన్నవాళ్లను, కావల్సినవాళ్లనూ, వదులుకుని లలిత కట్టుగుడ్డల్తో స్టేషను కొచ్చింది. రాత్రి పదిగంటలకు ప్రసాద్‌ను వెనక రమ్మని, నేను వాడి సూట్‌కేస్ పట్టుకు స్టేషను కెళ్లాను.

రైలు వచ్చింది. ప్రసాద్ రాలేదు!

ఫోన్ చేశాను. నాన్న నా గదిలోనే వున్నాడు మాట్లాడుతూ. బయటపడేందుకు వీల్లేకుండావుంది. ముందు లలితను రైలెక్కించెయ్. అంతగా అయితే, నేను టాక్సీలో అన్నా వెళ్లి ఆమెను కలుస్తాను." ప్రసాద్ చెప్పిన విషయం లలితకు చెప్పాను.

లలితకు, ప్రసాద్ అంటే ప్రాణం. కాదనకుండా రైలెక్కింది. ఆశలతో,

ధైర్యంతో జంటగా మద్రాసు ప్రయాణమైంది, చీకట్లో రాబొయ్యే వెలుతురును నమ్ముకుని....

"ఇక్కడున్నారా?" పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్మూర్తి, వచ్చాడు డాబా మీదకు.

బంట్రోతు కుర్చీ తెచ్చి వేశాడు.

"క్రింద ఇన్స్పెక్టరుగారున్నారు రమ్మను"

"ఎవరూ?...." నే నాశ్చర్యపోయాను. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్మూర్తిగారు, ఈ వేళప్పుడు రావటమే ఆశ్చర్యం. ఆయనతోపాటు ఇన్స్పెక్టర్‌కూడ రావటము.... ఏదో విశేషముండాలి?

''ఏదో పనిమీదనే వచ్చారల్లేవుంది.''

రామ్మూర్తిగారు నవ్వారు, అవునన్నట్లు.

ఇన్స్పెక్టర్ వచ్చి నిలబడ్డాడు. వీధిదీపం కాంతి, వెన్నెలలో అతను చాలా అందంగా కనబడ్డాడు. అంతేగాదు, ఇంత సుకుమారిడికి, పోలీసు ఉద్యోగానికెలావచ్చాడా అన్న ఆశ్చర్యమూ కలిగింది.

"కూర్చో"

అతను కూర్చులేదు.

రామ్మూర్తిగారు, గొణుకుంటున్న రాగం ఆపి, "కూర్చో। పరవాలేదు" అని చెప్పి, ''రేపెడదామయ్యా అంటేకాదు గూడదని లాక్కొచ్చాడు. ఇంకొరింకోరయితే వచ్చేవాణ్ణిగాదు. పోలీసు ఇన్స్పెక్టరాయే। రాక తప్పలేదు।'' అన్నాడు.

''చెప్పండి।''

మామూలే! ఈ కుర్రాడు కొత్తగా వచ్చాడు ఉద్యోగంలోకి. యువక రక్తం చూడండి, అవినీతి, వ్యభిచారం, పేకాటలు, దొమ్మీలు, అన్నీ రూపు మాపాలని తాపత్రయం! మంచిదేగదా! ఇతగాడొచ్చాక పరిస్థితి కొంత మెరుగైన మాట నిజమే; కాస్త ప్రభుత్వంపుంది సుమా అనిపిస్తున్నాడు"

సబ్ ఇన్స్పెక్టర్ తలొంచుకున్నాడు.

"కుర్రాడికి, ఆవేశమేగాదు కాస్త వివేకమూవుంది. ఊరికే తొందరపడకుండా, వచ్చిన కేసు కాస్త విచారించి, వాకబుచేసి, మరీ ముందుకు పోతున్నాడు. అంతా బాగానేవుంది" రామ్మూర్తిగారు సందేహించారు।

"చెప్పండి।" అభయమిచ్చాను

"ఇవ్వాళ ఆ లలిత కేసు....ఋజువుకాలేదని కొట్టేశారు చూడండి। అదిగో యితను చాలా మథనపడి పోతున్నాడు. సాక్ష్యం, చట్టం అన్నీ ఆమెకు వ్యతిరేకంగా వున్నా మీరు కొట్టేయడం, ఆమెను నిర్దోషని వదిలెయ్యటం నచ్చలేదు. ఇలా మీరు మెత్తగావుంటే, తను ఉద్యోగం చెయ్యలేనంటాడు" రామ్మూర్తి తన పని ఆయిపోయిందని, కాళ్లు ఊపుతూ, కూనిరాగం తీస్తూ కూర్చున్నాడు.

ఇన్స్పెక్టర్, నావేపు ఆశగా చూశాడు అతన్ని చూస్తే నాకు ముచ్చట వేసింది. దగ్గరగా వెళ్లి భుజం మీద చెయ్యివేశాను. "మీరు అధైర్యపడకండి నేనూ మనిషిని। నాకున్న బలహీనతలవల్ల, మీకు నిరుత్సాహం కలిగించివుంటాను ఏం?...."

రామ్మూర్తిగారు గలగలా నవ్వేసి, "నే చెప్పాగదటోయ్. మేజస్ట్రేటుగారు చాలా నిక్కచ్చి మనిషి। వెధవది యాభయ్యేళ్లొచ్చిన నాకే, ఆయన ముందు కేసు ఎత్తుకోవాలంటే కాళ్లు వణుకుతుంటాయి।"

రామ్మూర్తిగారు, తన భారీశరీరంతో ఇన్స్పెక్టర్తో వెళ్లిపోయారు

నా పరిస్థితి నాకే విచిత్రంగా తోచింది. నా వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నానేమో అన్న అనుమానం కలిగింది. కారణం?

....లలిత లేచిపోయింది.

ఆ రోజు, మా పేట, ఆ వార్తతో మేల్కొంది. అంతవరకూ చలపతిరావు అంటే తెలియని వాళ్లకూ్కడ, అతనొకడున్నాడని తెలిసింది. ఆయింట్లో ఆ తర్వాత కొన్నిరోజుల్దాక, పొయ్యిలో పిల్లి లేవలేదు.

ప్రసాద్, వారం రోజులు ఆస్పత్రిలో వున్నాడు. అతడు ఆస్పత్రి వది లేసే వేళకు, గంపెడు చీకటి. అవమానము, బాధతో చలపతిరావు, ఆయన సంసారం వూరొదిలి వెళ్లిపోయింది।

ప్రసాద్, ఆ తర్వాత కొన్నాళ్లకు గతాన్ని మర్చిపోయి, విధికి తలవంచి, గుండెల్లో మండే అగ్నిగోళాన్ని వెలికిరాకుండా తట్టుకుంటూ, పెళ్లి చేసుకున్నాడు. పిల్లల్నకన్నాడు. సుఖంగానే వున్నాడు.

నరసింహారావుగారు, కొడుకు పెళ్లిచూసి, మనవడిని ఎత్తుకుని, హాయిగా, ఓ తెల్లవారు ఝామున కన్నుమూశారు।

మిగిలింది నేను!

నరసింహారావు దయార్ద్ర హృదయులు! నన్ను 'లా' చదివించారు. తమ పలుకుబడి, ఉపయోగించి, డబ్బుకూ్కడా వెనకాడకుండా, నాకు ఉద్యోగం ఇప్పించారు. అందుకు ఆయనకు నే కృతజ్ఞుడిగా వుండాలి। అది ధర్మం

కాని........

నేను చేసిందేమిటి?

నరసింహారావుగారికి లొంగిపోయి, మిత్రద్రోహం ఆత్మద్రోహం చేసుకుని

ప్రేమికులను విడగొట్టేందుకు కారణభూతుడినయ్యాను!

ఎవరికి తెలియకపోయినా, నాకు తెలుసు, లలిత పతనం కావటానికి కారణం నేను. ఆమెకేలా శిక్ష విధించేది.

నేనే 'దోషి' నయితే....